పచ్చదనంపై ప్రత్యేక శ్రద్ధ

పంచాయతీ నర్సరీల్లో మొక్కల పెంపునకు చర్యలు

శంషాబాద్ రూరల్: పచ్చదనం పెంపునకు ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవానికి మొక్కలు పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పంచాయతీల ఆధ్వర్యంలో ఉపాధి హామీ నిధులతో నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని చేపట్టారు. మండలంలోని 21 పంచాయతీల్లో నిర్దేశించిన లక్ష్యం మేరకు సంచుల్లో మట్టి నింపి విత్తనాలు వేస్తున్నారు. గ్రామాల్లోని ప్రభుత్వ ఖాళీ స్థలాలు, పాఠశాల ఆవరణలు, రోడ్లకు ఇరువైపులా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఈ మొక్కలను నాటనున్నారు.


కవ్వగూడ పంచాయతీ నర్సరీలో బ్యాగుల్లో విత్తనాలు వేస్తున్న కూలీలు

పంచాయతీకి పది వేల మొక్కలు..

ప్రతి పంచాయతీకి పది వేల మొక్కలను నాటేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు ఆయా పంచాయతీల పరిధిలో ఉన్న నర్సరీల్లో మొక్కలను పెంచేందుకు చర్యలు చేపట్టారు. 21 పంచాయతీలకు మొత్తం 2,10,000 మొక్కలను పెంచాల్సి ఉంది. ఇది వరకు నాటిన వాటిలో 93 వేల మొక్కలు మిగిలాయి. వాటిని మినహాయించి మిగిలిన మొక్కలను పెంచేందుకు నర్సరీల్లో ఏర్పాట్లు చేశారు.

రకరకాల మొక్కలు..

నర్సరీల్లో రకరకాల మొక్కలు పెంచుతున్నారు. ఇప్పటికే చాలా చోట్ల విత్తనాలు నాటే పనులు ప్రారంభించారు. నర్సరీల్లో కానుగ, నేరేడు, ఈత, తాటి, గుల్మోరా, రాగి, మర్రి, చింత, సీతాఫలం, తులసి, బొప్పాయి. కలమంద, తదితర మొక్కలను పెంచుతున్నారు. వీటితో పాటు ఇళ్ల వద్ద పెంచుకునేందుకు మందార, గులాబీ, గన్నేరు, మునగ, కరివేపాకు, జామ, దానిమ్మ వంటి రకాలను పెంచేందుకు చర్యలు చేపట్టారు.


నర్సరీలోని మొక్కలు

సంరక్షణపైనే సందేహాలు..

ఏటా పంచాయతీల ఆధ్వర్యంలో వేల సంఖ్యలో మొక్కలు నాటుతున్నా వాటి సంరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. రైతుల పొలాలు, గ్రామాల్లోని ఇళ్ల వద్ద నాటిన మొక్కలతో పాటు ప్రభుత్వ స్థలాలు, రోడ్ల వెంబడి నాటిన మొక్కల్లో సింహభాగం కనిపించడంలేదు. ప్రతి ఏడాది వర్షాకాలంలో భారీ సంఖ్యలో మొక్కలు నాటుతున్నా ఈ మేరకు వాటి సంరక్షణ లేకపోవడంతో లక్ష్యం నెరవేరడంలేదని స్థానికులు పేర్కొంటున్నారు. రైతులతో పాటు గ్రామస్తులకు పచ్చదనంపై మరింత అవగాహన కల్పించి మొక్కలను సంరక్షించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. గత ఏడాది ఆయా పంచాయతీల్లో పెంచిన మొక్కల్లో ఇంకా 93 వేల మొక్కలను నాటలేదు. వీటిని ఆయా నర్సరీల నుంచి అవసరం ఉన్న చోటకు తరలించి వచ్చే వానాకాలంలో నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సీఎం సహాయ నిధికి ఒక రోజు వేతనం


చెక్కును అందజేస్తున్న వీసీ జానయ్య

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని బోధన, బోధనేతర సిబ్బంది ఒక రోజు వేతనాన్ని వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ అల్దాస్ జానయ్య అందజేశారు. బుధవారం ముఖ్యమంత్రి కార్యదర్శి డాక్టర్ జీ చంద్రశేఖర్(ఐఎఎస్)ని సచివాలయంలో కలిసి రూ. 63,80,138 చెక్కును అందజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మణికొండ: వాసవీ క్లబ్ కపుల్స్ మణికొండ శాఖ అధ్యక్షునిగా వంశీకృష్ణను మరో మారు అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. బుధవారం మణికొండలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈమేరకు నిర్ణయించారు. ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శిగా ఎస్. జగదీష్, కోశాధికారిగా శిరీషలను ఎన్నుకున్నారు. ఈ కమిటీ సంవత్సర కాలం పనిచేస్తుందని, తమ కమిటీ ఆధ్వర్యంలో గతంలోలా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని అధ్యక్షుడు వంశీకృష్ణ తెలిపారు.

ర్యాలీకి అనుమతివ్వండి

అత్తాపూర్: ఈ నెల 14న నిర్వహించనున్న ర్యాలీకి అనుమతి ఇవ్వాలని ఎస్‌వైఎఫ్ఐ అధ్యక్షులు రియాజ్ హుస్సేన్ అబీది బుధవారం రాజేంద్రనగర్ డీసీపీ సి.హెచ్.శ్రీనివాస్, ఏసీపీ టి.శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకట రామిరెడ్డిలను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 14న 13వ రజబ్ విలాదత్ బాసాదిత్ మౌలాయి ఖైనత్ హజ్రత్ అలీ సందర్భంగా ఖయూమ్‌నగర్‌లో ర్యాలీ చేపడుతున్నామన్నారు. దీనికి అనుమతి ఇవ్వాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఖదీర్ ఆలీ, రాజా బాక్సర్, బహదూ హుస్సేన్, హుసేనీ ఆలీ, మహ్మద్ ఇంతియాజ్ ఆలీ తదితరులున్నారు.



ర్యాలీ అనుమతి కోరుతూ వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌వైఎఫ్ఐ సభ్యులు

కేలండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



అత్తాపూర్: రాష్ట్రోపాధ్యాయ సంఘం రాజేంద్రనగర్ మండల శాఖ రూపొందించిన నూతన సంవత్సర కేలెండర్‌ను రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పుట్టాపాక ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఏ.వి.సుధాకర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలకృష్ణ, వెంకటయ్య, నాయకులు సుష్మ, మాధవి, స్నేహలత, సలోమీ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

మణికొండ: రాష్ట్ర బీజేపీ కార్యాలయంపై రాళ్లు, కర్రలతో దాడి చేసి పలువురిని గాయాల పాలు చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి. అంజన్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో గండిపేట మండల బీజేపీ నాయకులతో కలిసి ధర్నా, రస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఉందనే ధీమాతో ఏకంగా ఓపార్టీ రాష్ట్ర కార్యాలయంపై దాడులకు దిగటం దారుణమన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి పరిస్థితులు ఎక్కడకు దారి తీస్తాయో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన చేయాలన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి యత్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, జిల్లా మహిళా మోర్చ ప్రధాన కార్యదర్శి ఇందిర, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. నాగేష్, ఎన్. బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.


నార్సింగిలో రోడ్డుపై ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు ఏఈ మల్లేష్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. డాన్ బాస్కో ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 3 గంటల వరకు మైకెల్ కాలనీ, వినాయకనగర్, డిడి కాలనీ, కాళీమందిర్, ఎన్ఎఫ్‌సీకాలనీ, ఆదర్శ నగర్, ఎక్సైజ్ అకాడామీ, అభ్యుదయనగర్, అరుణోదయనగర్, సంధ్యానగర్, జీఆర్ నగర్, మాచనపల్లి ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు.

రేపు వైకుంఠ ద్వార దర్శనాలు



మణికొండ: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని దేవాలయాల్లో రోజంతా ఉత్తర ద్వార దర్శనాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఆయా దేవాలయాల అర్చకులు తెలిపారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని గోల్డన్ టెంపుల్, శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, మంచిరేవుల శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో పెద్ద ఎత్తున భక్తులు దర్శనాలు చేసుకుంటారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని అర్చకులు తెలిపారు. ఉదయం 4గంటలకు స్వామి వారి అభిషేకం, 5.30 గంటలకు వాహన సేవ, 5.45 గంటల నుంచి రాత్రి వరకు ఉత్తర ద్వార దర్శనాలకు అనుమతి ఇస్తామని, భక్తులు పెద్ద ఎత్తున దేవాలయాలకు వచ్చి స్వామి వార్లను దర్శనం చేసుకోవాలని వారు కోరారు.

సౌకర్యాల కల్పనకు పెద్దపీట


పోచమ్మ కాలనీలో కమ్యూనిటీహాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: మున్సిపాలిటీల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వారికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేసి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె. నరేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలో రూ. 5.06 కోట్లతో 5వ వార్డులో రూ.50లక్షలతో సీసీ రోడ్డు, 6వ వార్డులో రూ. 35లక్షలతో అలిజాపూర్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ 7వ వార్డులో రూ. 50లక్షలతో స్పెక్ట్రం విల్లాస్ వద్ద బాక్స్ కల్వర్ట్, రూ. 50లక్షలతో వీధి కుక్కల జనన నియంత్రణ కేంద్రం, 9వ వార్డు అలకాపూర్ సెక్టార్-1లో రూ.1.04కోట్లతో పార్కు అభివృద్ధి, 12వ వార్డులో రూ. 35లక్షలతో ల్యాంకోహిల్స్ జీ సర్కిల్ నుంచి ఔటర్ సర్వీసు రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్, 13వ వార్డులో రూ.65లక్షలతో పోచమ్మ కాలనీలో నిర్మించిన కమ్యూనిటీహాల్, రూ. 1.27 కోట్లతో లక్ష్మీనగర్ కాలనీలో చేపట్టిన బటర్‌ఫ్లై పార్కును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే పలు పార్కులను అభివృద్ధి చేయగా ప్రస్తుతం మరో రెండు పార్కుల అభివృద్ధి, ప్రారంభోత్సవాలను చేశామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల బెడద నివారణకు స్థానికంగానే వాటి నియంత్రణ చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేయటం మంచి పరిణామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ కె. నరేందర్‌రెడ్డి, కమీషనర్ డి. ప్రదీప్‌కుమార్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ తలారి మల్లేష్‌ముదిరాజ్, డీఈ శివ సాయి పాల్గొన్నారు.

పీఅండ్‌టీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ సభ్యులు బుధవారం కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీ సోషల్ వర్క్స్ అసోసియేషన్ అధ్యక్షులు నదీమ్, ప్రధాన కార్యదిర్శ హఫీజ్‌ఖాన్‌ల ఆధ్వర్యంలో కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఅండ్‌టీ కాలనీ బ్లాక్-ఏ,బీ,సీ,డీ, స్పెషల్ బ్లాక్‌లలో 125 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్థలంలో స్వీపింగ్ పనులు జరగడం లేదన్నారు. రోడ్లు, డ్రైన్లపై పారిశుద్ధ్యం లోపించడం వల్ల కాలనీలో పూర్తిగా దుమ్ము వ్యాపించి కొన్ని నెలల నుంచి ఈ సమస్య కాలనీలో నెలకొందన్నారు. కార్యక్రమంలో కుతుబుద్దీన్ సాహబ్, రిటైర్డ్ తహసీల్దార్ హమీద్, రిటైర్డ్ ప్రిన్సిపల్ జాఫర్, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ సోషల్ వర్క్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అత్తాపూర్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు లభిస్తాయని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. అత్తాపూర్ డివిజన్‌కు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు బుధవారం ఆయన చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్‌గౌడ్, ప్రవీణ్ రెడ్డి, బోయ రమేష్, రవిగౌడ్, మహేందర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


అత్తాపూర్ డివిజన్‌కు చెందిన లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టిసారించాలి


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజల సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని బృందావన్ కాలనీలో బస్తీ సమస్యలపై స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు వాటిని త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జి.పాండుయాదవ్, రావుల భాస్కర్, రవి, శివరాజ్, దామాజీ, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన


ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పరిశీలిస్తున్న డీసీ రవి కుమార్


సులేమాన్‌నగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవాజుద్దీన్ అహ్మద్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సులేమాన్‌నగర్ డివిజన్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వేను బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ రవి కుమార్ వార్డు ఇన్‌చార్జితో కలిసి పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని డివిజన్లలో గతంలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలను నమోదు చేస్తున్నామన్నారు.

అత్తాపూర్: ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్‌లు మంజూరు చేయాలని సులేమాన్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవాజుద్దీన్ అహ్మద్ కోరారు. బుధవారం డివిజన్ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి అర్హులను గుర్తించి వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మహ్మద్ తాహేర్ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో బోరు వేయించిన డిప్యూటీ మేయర్


మెథడిస్ట్ చర్చిలో సొంత నిధులతో బోరు వేయిస్తున్న డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: ప్రజల సమస్యలను తెలుసుకోని వాటి మెరుగైన సదుపాయాలను కల్పిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి తెలిపారు. హైదర్షాకోట్ గ్రామంలోని 4వ వార్డులో ఉన్న మెథడిస్ట్ చర్చిలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి తన సొంత నిధులతో బోర్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమార్‌యాదవ్, శివ, శ్రీకాంత్, క్రైస్తవ సోదరులు యేసు, ప్రవీణ్, ప్రసాద్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు నాంపల్లిలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంపై కర్రలు, కోడిగుడ్లతో దాడి చేయడాన్ని ఖండిస్తూ బుధవారం రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పొన్నామోని మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆరాంఘర్ చౌరస్తా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను తగలబెడుతుండగా రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ పోలీసులు బీజేపీ పార్టీ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాజేంద్రనగర్ బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ఏ పార్టీ నాయకులైన ఏమైనా పొరపాటుగా మాట్లాడితే రాజకీయంగా ఎదుర్కొవాలి తప్పా... బీజేపీ పార్టీ కార్యాలయంపై దాడి చేయడం హేయమైన చర్య అని... కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నామని విర్రవీగుతూ కర్రలు, కోడిగుడ్లతో వీధి రౌడీల్లా ప్రవర్తించడాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యు.శ్రీధర్, పార్లమెంటు కన్వీనర్ ఎస్. మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, నాయకులు జోగి రవి, అడికె రాజు, జయానంద్ రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి సందర్శించి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, రికార్డులను సీపీ పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.


రాజేంద్రనగర్ పీఎస్‌ను తనిఖీ చేస్తున్న సీపీ అవినాష్ మహంతి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ బి.శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. బుధవారం 16వ డివిజన్‌లోని భాగ్యనగర్ కాలనీ, 17వ డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్ కాలనీ, 18వ డివిజన్‌లోని సాయిబాబా కాలనీలో డోర్ టూ డోర్ చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. తడి, పొడి, హానికర చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోకు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు జగన్, మోహన్, వెంకటేష్, సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయించాలి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ బుధవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను ఆయన కోరారు. నియోజకవర్గంలో ప్రస్తుతం రూ.292 కోట్లతో వరద నీటి పైప్‌లైన్, వరద నీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం ఈ పనులు చివరి దశలో ఉన్నాయని ఆయన అన్నారు. ఈ పనులు పూర్తి కాగానే కొత్త రోడ్లు వేయడానికి చొరవ చూపాలని ఆయన జిల్లా కలెక్టర్‌ను కోరారు. కార్వాన్‌లోని టోలిచౌకీ, గోల్కొండ, నానల్‌నగర్, కార్వాన్ తదితర డివిజన్లలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని ముఖ్యంగా భారీ వరద నీటి పైప్‌లైన్‌లు వేసిన ప్రాంతాలలో రోడ్లు గుంతలయంగా ఉన్నాయని ఆయన కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాగా సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.


కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

బుద్వేల్‌లో థ్యాంక్స్ గివింగ్ సువార్త కార్యక్రమం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ షెకినా గొస్పెల్ చర్చి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి థ్యాంక్స్ గివింగ్ సువార్త కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటి డేనియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున క్రైస్తవ సోదరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలపించిన భక్తి గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మా రెడ్డి, బీఆర్ఎస్‌వీ అధ్యక్షులు గౌతమ్, బీఆర్ఎస్‌వీ నాయకుడు జోసెఫ్ తదితరులతో పాటు రాజేంద్రనగర్ మండల పాస్టర్స్, కుటుంబ సభ్యులు, క్రైస్తవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



థ్యాంక్స్ గివింగ్ సువార్త కార్యక్రమంలో పాల్గొన్న పోరెడ్డి ధర్మారెడ్డి